క్లుప్తంగా

పేదల పెన్నిధి జగనన్న



కేక్ కట్ చేస్తున్న జేసీఎస్ కన్వీనర్ రామచంద్రరావు

జరుగుమల్లి(సింగరాయకొండ): పేదల పాలిటి పెన్నిధిగా తన పరిపాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుజువు చేసుకున్నాడని వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు కొనియాడారు. జగనన్న పుట్టినరోజు వేడుకలను శనివారం రాత్రి జరుగుమల్లి మండలం పచ్చవలో తాటికొండ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తరువాత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 100 మందికి చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ కొండాబత్తిన కృష్ణయ్య, నూతలపాటి అశోక్, తాటికొండ చిన్నా, మారుతి, రామానాయుడు, ముళ్లమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: పండుగ రోజుల్లో గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం తాగి గొడవలకు దిగితే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం 10 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మీపై ఎటువంటి ఫిర్యాదు వచ్చినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



టంగుటూరు గ్రంథాలయంలో విద్యార్థులు

టంగుటూరు: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధన్‌రాజు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులతో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పాకల విద్యార్థినులు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పాకల విద్యార్థినులు

సింగరాయకొండ: రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య తెలిపారు. ఈ నెల 20న పాఠశాలలో జరిగిన ప్రకాశం జిల్లా కబడ్డీ జూనియర్ బాలికల ఎంపికలో పాఠశాలకు చెందిన కె.సిపోరా, కె.ధనలక్ష్మి ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

భగవద్గీత ప్రచారం



ప్రచారంలో కమిటీ సభ్యులు

వలేటివారిపాలెం: మార్గశిర మాసం పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వలేటివారిపాలెం మండలంలోని చుండి, అయ్యవారిపల్లి, పోలినేనిచెరువు, గరుకుపాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్ మాట్లాడుతూ మార్గశిర మాసంలో శిరం అనగా తల అని, మార్గం అనగా దారి అని తలలోనికి దారి అనే విధానం ఉన్నది అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు కె.నరసింహులు, ఎం.నాగమ్మ, వి.మహేంద్ర, సీహెచ్ మధుసూదన్ రావు, డి.రమణయ్య, ఎం.కొండారెడ్డి, ఎం.పెద్ద కొండారెడ్డి, టి.మాలకొండారెడ్డి, ఎం.ధనలక్ష్మి, ఎం.కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

రైతు నెత్తిన బీమా భారం

- ఉచిత పంటల బీమాకు మంగళం
- రైతులే ప్రీమియం చెల్లించాలన్న ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- పెట్టుబడి సాయం అందక.. ఉచిత బీమా లేక రైతుల్లో ఆందోళన

పామూరు:

పంటల బీమా పథకం అమల్లోనూ కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తోంది. ఉచిత పంటల బీమా పథకానికి ఏకంగా మంగళం పాడేసి అన్నదాతల నడ్డి విరుస్తోంది. ప్రస్తుతం పండిస్తున్న పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం చేసిన ప్రకటనలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలప్పుడు ఇస్తానన్న పెట్టుబడి సాయం ఇవ్వకపోగా మళ్లీ అదనంగా పంటల బీమా భారం ఏం టని కూటమి ప్రభుత్వ తీరును విమర్శిస్తున్నారు. మళ్లీ రైతన్నలకు చీకటి రోజులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకంద్వారా రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆమాట తప్పింది. ఇచ్చిన హామీ అమలుచేయకుండానే అదనంగా పంటల బీమా ప్రీమియం భారాన్ని రైతులనెత్తిన మోపింది. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వమే పంటల బీమా చెల్లించేది. వరి, పెసర, మినుము, మొక్కజొన్న పంటలకు సంబంధించి ఈ నెలాఖరు లోగా బీమా చెల్లించాలని డెడ్‌లైన్‌విధించారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



కె.అగ్రహారంలో వర్షానికి దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సాగు విస్తీర్ణం ఇలా..

మండలంలో ఖరీఫ్‌లో 1643 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారులో అందులో వరి 21 హెక్టార్లు, కంది 1600 హెక్టార్లు, సజ్జ 22 హెక్టార్లలో సాగు చేశారు. అదే విధంగా రబీలో 3079 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. వరి 425, జొన్న 577, మొక్కజొన్న 18 హెక్టార్లు, ఉలవ 25 హెక్టార్లు, మినుము 888 హెక్టార్లు, శనగ 757 హెక్టార్లు, అలసంద 51 హెక్టార్లు, ఆవాలు 5 హెక్టార్లు, పొగాకు 307, మిరప 26 హెక్టార్లలో సాగు చేశారు.

అన్నదాత సుఖీభవ ఎప్పుడు ...?

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ పథకం పేరిట చేస్తానన్న రూ.20 వేల ఆర్థికసాయం ప్రస్తుతానికి లేనట్లే కనిపిస్తోంది. ఖరీఫ్‌సాగు (వరి) జరిగి ప్రస్తుతం పంట చేతికి వచ్చేసింది. అయినా ఇంతవరకు పెట్టుబడి సాయం అందించలేదు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమైతే ఏటా ప్రతి రైతుకు రు.13,500 పెట్టుబడి సాయం కచ్చితంగా ఖరీఫ్ సాగునాటికి అందించేది. పంటల బీమా ప్రీమియం కూడా రైతుల తరుపున ప్రభుత్వమే చెల్లించేది.



ఫెంగల్ తుపానుతో గుమ్మనంపాడులో నీట మునిగిన మినుము (ఫైల్)

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి:



రబీ సీజన్ పంటలకు సంబంధించి గతం మాదిరిగానే ఇప్పటి కూటమి ప్రభుత్వం కూడా పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకోవాలి. రైతులే ప్రీమియం కట్టుకోవడంపై ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకుని ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి అన్నదాతలకు అండగా నిలవాలి. పెట్టుబడి సాయం ఎప్పుడు అందిస్తారనేని ప్రభుత్వం ప్రకటించి రైతుల్లో భరోసా కల్పించాలి.

కె.మాల్యాద్రి, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

వీధి దీపాలు వెలిగాయ్..!



బస్టాండ్ సెంటర్ నుంచి కామేపల్లి సెంటర్ వరకు వెలుగుతున్న వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్..

కొండపి: మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి కామేపల్లి సెంటర్ వరకు వీధి దీపాలను అధికారులు అమర్చారు. రాత్రివేళ వీధి దీపాలు వెలగక ఆ ప్రాంతమంతా చీకటిమయంగా ఉంటూ ద్విచక్రవాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. దీనిపై సాక్షిలో 'ప్రత్యేకాధికారుల పాలనలో పట్టించుకునేదెవరు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి స్తంభాలకు వీధి దీపాలు అమర్చి వెలిగించారు. దీంతో ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పాయి.

సంక్షేమ హాస్టళ్లు పేద విద్యార్థులకు వరం



బీసీ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు): సంక్షేమ హాస్టళ్లు పేద విద్యార్థులకు వరం లాంటివని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాదికారి ఎం అంజల అన్నారు. మండలంలోని సి.నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ గుంటిమడుగు శ్రీనివాసవర్మ రూ.70 లక్షల సొంతనిధులతో నిర్మించి ఇచ్చిన బీసీ బాలుర వసతిగృహాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, జిల్లా బీసీ సంక్షేమశాఖాదికారి యం.అంజల దాత శ్రీనివాసవర్మతో కలిసి ప్రారంభించారు. దాత నిర్మించి ఇచ్చిన హాస్టల్ భవనం కార్పొరేట్ హాస్టళ్లను తలదన్నేలా ఉందన్నారు. దాత శ్రీనివాసవర్మను ఘనంగా సన్మానించారు. డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ ఎం రంగసుబ్బనాయుడు, ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, హెచ్‌ఎం మందాకుమారి, అడిషనల్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్.జబ్బార్, యారవ శ్రీనివాసులు, కే.వి.రమణయ్య, షిప్‌సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, బి.వెంగయ్య తదితరులు పాల్ఒగన్నారు.

రైతు సేవా కేంద్రాలతో మెరుగైన సేవలు



సి.నాగులవరంలో రైతుసేవాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు): రైతు సేవా కేంద్రాలతో రైతులకు ఎన్నో రకాల సేవలు అందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని సి.నాగులవరంలో రూ.21.80 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు పొందవచ్చని, పంటల సాగులో మెళకువలు, సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. ఈసందర్భంగా విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు పంపిణీచేశారు. తొలుత సీఎస్‌పురంలో రూ.1.05 కోట్ల ఉపాధి నిధులతో నిర్మించిన సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.వెంకట రమణ, డీఎల్‌డీఓ కె.శ్రీనివాస రెడ్డి, ఏఓలు బి.సంపత్‌కుమార్, కంచం రాధ, ఎంపీటీసీ లలితమ్మ, ఎన్‌ఆర్‌ఐ శ్రీనివాసవర్మ, సర్పంచ్ శ్రీరామ పద్మావతి, యారవ శ్రీనివాసులు, షిప్‌సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, మాజీ ఎంపీపీ తోడేటి అల్లూరయ్య, బి.వెంగయ్య, మన్నేపల్లి శ్రీను, ఎస్సీ మాలకొండయ్య, బొబ్బూరి రమేష్, చావా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పిల్లి వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల సాధారణ సమావేశం ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సవరణ దాటి 15 నెలలు దాటినా ఇంకా నియమకాన్ని చేపట్టలేదన్నారు. పెండింగ్ డీఏలు, ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, జీపీఎఫ్, పోలీస్ సిబ్బందికి సరెండ్ లీవ్ చెల్లింపులు బకాయిలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు ఎం.జక్రయ్య, బి.మల్లిఖార్జున్, వెంకట సుబ్బయ్య, నాసరవలి, అరఫత్, పుల్లయ్య, మస్తాన్‌వలి, రఫీద్, వెంకటస్వామి, నాగమల్లేశ్వర రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

హనుమంతునిపాడు: మండలంలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని మహ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హనుమంతునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు డి.భాస్కరెడ్డి, దద్దాల శ్రీనివాసులు, నాళి వెంకటయ్య, బ్రహ్మయ్య, నాళి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన గణిత ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థులకు గణిత సబ్జెక్టులో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వై శ్రీనివాసులు, బి.సుబ్బారావు, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహ్మదాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): రెవెన్యూ అసోసియేషన్, ఏపీ జేఏసీ నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కనిగిరిలో జరిగిన కార్యక్రమంలో 13 మండలాల నాయకులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సమావేశం యూనియన్ అధ్యక్షుడు బొల్లాపల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించి 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. నూతన సంఘ అధ్యక్షునిగా ఎం. శ్రావణ్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.కిషోర్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా పి.పురుషోత్తంరెడ్డి, రాజ్యలక్ష్మి, సెక్రటరీగా ఎంవీ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ పృథ్వీ రాజ్, వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, ట్రెజరర్‌గా డి.ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కనిగిరి డివిజన్ లోని 13 మండలాల రెవెన్యూ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా పాకల సముద్రతీరం



పర్యాటకులతో పాకల సముద్రతీరం

సింగరాయకొండ: పాకల సముద్రతీరం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు భారీగా తీరానికి వచ్చి సముద్రస్నానం చేస్తూ సందడిగా గడిపారు. కొన్ని రోజులుగా వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో బీచ్‌కు పర్యాటకుల తాకిడి తగ్గింది. ప్రస్తుతం వాయుగుండం బలహీనపడటంతో పాటు అలల ఉధృతి తక్కువగా ఉండటంతో సెలవురోజు కావటంతో బీచ్‌లో పర్యాటకుల రద్దీ పెరిగింది.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



కందులూరులో విత్తనశుద్ధి చేస్తున్న ఐసీఆర్‌పీ శృతి

టంగుటూరు: శనగ విత్తనాలను విత్తుకునే ముందుకు విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చని ఐసీఆర్‌పీ శృతి అన్నారు. మండలంలోని ఎం నిడమానూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంట వేసే ముందు బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. అంతర పంటల వల్ల కలుపు మొక్కలు రాకుండా నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్పీలు శృతి, రైతులు కాకుమాని శ్రీకాంత్, కొత్తపల్లి వెంకయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి



నేతివారిపాలెంలో ఏర్పాటుచేసిన స్టార్



జగజ్జీవరామ్‌కాలనీలో ఏర్పాటుచేసిన క్రిస్మస్ స్టార్

కొండపి: మండలంలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. డిసెంబర్ 25న వచ్చే క్రిస్మస్ పండుగకు ఐదు రోజులు ముందు నుంచే పండుగ వాతావరణం నెలకొంది. ప్రధాన కూడళ్లలో పెద్ద పెద్ద స్టార్లను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే లైట్లతో కూడిన తారలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మండలంలో సుమారు 100కి పైగా చర్చిలు ఉన్నాయి. వీటన్నింటినీ ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా ప్రార్థన నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పీవీరావుకు ఘన నివాళి



పీవీరావుకు నివాళి అర్పిస్తున్న జేఏసీ నేతలు

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మాల మహానాడు అధ్యక్షుడు దివంగత పీవీరావు వర్ధంతిని స్థానిక మాల జేఏసీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కనిగిరి డివిజన్ జేఏసీ మాల సంఘ నాయకులు చదలవాడ బాలగురవయ్య, యరజాల బాలనారాయణ, అడ్వకేట్ కొటికల బాలబాదుర్ల, పందిటి మోహన్‌రావు, కలవకూరి శాంతరాజు, మురహరి వెంకటేశ్వర్లు, దమ్ము శ్రీను, కోటపాటి రమణ, యానాది తదితరులు పాల్గొన్నారు.

దర్గాగా రోడ్డు ఆక్రమణ



మర్లపాడులో మార్జిన్ లేకుండా రహదారికి ఇరువైపులా నిర్మించిన సిమెంట్ ఫ్లోర్

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారిని దర్జాగా ఆక్రమించేశారు. గ్రామంలోని బస్టాండ్ సెంటర్ నుంచి కొణిజేడు వైపు వెళ్లే మార్గం మధ్యలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మలుపు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ లేకుండా అనుసంధానం చేసి సిమెంట్ ఫ్లోర్ నిర్మించారు. ఆ సిమెంట్ ఫ్లోర్‌పై ఎటువంటి వాహనాలు వెళ్లకుండా పెద్దపెద్ద బండరాళ్లు అమర్చారు. ఈ బండ రాళ్ల వల్ల ఆర్టీసీ బస్సులు, ఆటోలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అసలే మలుపు కావడంతో ఈ మార్గం గుండా వెళ్లాలంటే వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.